## క్లుప్తంగా

### ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు వేయండి



జాలిమంచిలో పోలీసు కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం మండలంలోని జాలిమంచి, దొడ్డనగేరి, మాంత్రికి గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పోలీసుల భద్రత నడుమ ఓటింగ్ జరుగుతుందని, ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నపీరయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### మంత్రాలయం చేరిన ఈవీఎంలు



ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంకు సీల్ వేసిన అధికారులు, పోలీసులు

మంత్రాలయం : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంత్రాలయం నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలు, బ్యాలెట్ యూని ట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ పాట్స్ పోలీస్ భద్రత మధ్య శనివారం వేకువ జామున మంత్రాలయం చేరుకున్నాయి. వాటిని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్ చేసి మంత్రాలయం పరిమళ పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. మంత్రాలయం తహసీల్దార్ శ్రీధర్ మూర్తి, పెద్దకడబూరు తహసీల్దార్ సురేష్, సీఐ ఎరిసా వలి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### నీటి పొదుపు అందరి బాధ్యత



ఎల్లెల్సీలో నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) ద్వారా వస్తున్న నీరు ఆగిపోయిన నేపథ్యంలో పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శనివారం ఎల్లెల్సీలో ఇన్‌ఫ్లో ఆగిపోవడంతో డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ శరత్ చంద్రతో కలిసి ఎల్లెల్సీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లెల్సీ ద్వారా వచ్చిన నీటిని ఎస్ఎస్ ట్యాంక్‌లో తాగునీటి అవసరాల కోసం నిల్వచేసినట్లు తెలిపారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకుంటే కొళాయిల ద్వారా మరిన్ని రోజులు సరఫరా చేసే అవకాశం ఉందన్నారు. నీటి పొదుపును అందరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.

### బాల్య వివాహం చట్టరీత్యానేరం



నోటీసు అందజేస్తున్న పోలీసులు

మద్దికెర: బాల్య వివాహాలు చేయడం చట్టరిత్యా నేరమని.. ఎవరైనా చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని హంప గ్రామంలో బాల్యవివాహం చేస్తున్నారని తెలుసుకుని అమ్మాయి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. యుక్తవయసు రాకముందే ఆడపిల్లలకు పెళ్లి చేస్తే జరిగే అనార్థాల గురించి అవగాహన కల్పించి నోటీసు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, ఉపసర్పంచ్ తిమ్మప్ప ఉన్నారు.

### గడ్డివామి దగ్ధం



కాలిపోతున్న గడ్డివామి

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలో గొర్ల కాశీనాథ్ అనే రైతు పశువుల మేత కోసం వేసుకున్న గడ్డివామి శనివారం దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలు ఆర్పివేశారు. అప్పటికే వామి కాలి బూడిదైంది. రూ. 60 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

# ప్రచారాలు, ప్రారంభోత్సవాలకు అనుమతి తప్పనిసరి

- ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ
- ఎంసీసీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధులకు నామినేషన్ ప్రక్రియపై దిశా నిర్దేశం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: రాజకీయ ప్రచారాలకు, పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. శనివారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తన ఛాంబర్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నామినేషన్ ప్రక్రియ తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పకుండా నిబంధనలు పాటించాలన్నారు. సభలు–సమావేశాలు, ఊరేగింపులు, ర్యాలీలు, రాజకీయ పార్టీ ప్రచారాలపై ఇంటింటి ప్రచారాలపై 48 గంటలు ముందుగా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు.

**18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ**

ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారని సబ్ కలెక్టర్ తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల దాఖలు చేయవచ్చన్నారు. అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రతి అంశాన్ని పక్కాగా పరిశీలించనున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతో కొందరు అభ్యర్థులు డమ్మీ సెట్ దాఖలు చేయనున్నారన్నారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్లు నామినేషన్లు దాఖలు చేయడానికి వీలుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు చొప్పున ధారావత్తు చెల్లించాలన్నారు. అభ్యర్థులు ఫారం–26ను నామినేషన్ రోజు సాయంత్రం 3 గంటల్లోపు అందజేయాలన్నారు. ఎన్నికల్లో 'సువిద' యాప్‌లో దాఖలు చేసిన అనంతరం హార్డ్ కాపీలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థితో పాటు నలుగురు వ్యక్తులకు మాత్రమే ఛాంబర్‌లోకి అనుమతిస్తామన్నారు.

**26న నామినేషన్ల పరిశీలన**

అసెంబ్లీ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను ఈనెల 26వ తేదీన సాయంత్రం వరకూ పరిశీలిస్తారని సబ్ కలెక్టర్ చెప్పారు. సరైన నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల పేర్లు అదేరోజు ప్రకటిస్తారన్నారు. నామినేషన్ ఉపసంహరించుకునేందుకు ఈనెల 29వ తేదీ సాయంత్రం వరకు గడువు ఉంటుందన్నారు. ఇక మే నెల 13వ తేదీన పోలింగ్ ఉంటుందన్నారు. సమావేశంలో డీఎస్పీ శివనారాయణస్వామి, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఎన్నికల ఉప తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, డీఎల్‌పీఓ కార్యాలయపు పరిపాలనాధికారి వీరభద్రప్ప, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### సత్తాచాటిన గురుకుల విద్యార్థులు

ఆదోని రూరల్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మండలంలోని ఆరేకల్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారని ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. సత్తా చాటిన విద్యార్థులను శనివారం అభినందించారు. ఆమె మాట్లాడుతూ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ నుంచి 72 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా, 64 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో కె.వెన్నెల 456/470, ఎం.ఝాన్సీ 454/470, బైపీసీలో బి.సుశాంతి 428/440, ఎస్.రేణుక 427/440 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్‌లో 73 మంది విద్యార్థులు హాజరవ్వగా, 66 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఎంపీసీలో ఎం.సువర్ణరాణి 938/1000, ఎన్.సంధ్యారాణి 920/1000, బైపీసీలో టి.సలోమి 970/1000, యు.శ్రావణి 967/1000 మార్కులు సాధించారన్నారు. మొదటి సంవత్సరంలో 88.89, రెండో సంవత్సరంలో 90.41 ఉత్తీర్ణత శాతం వచ్చిందని వివరించారు.

## రోడ్డు నిర్మాణంపై టీడీపీ రాద్ధాంతం విడ్డూరం



మాట్లాడుతున్న గ్రామ సర్పంచ్ జేకే నరసమ్మ, గ్రామస్తులు

కోసిగి: మండలంలోని సజ్జలగుడ్డం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణంపై టీడీపీ నాయకులు రాద్ధాంతం చేసి పనులను అడ్డుపడడం విడ్డూరంగా ఉందని గ్రామ సర్పంచ్ జేకే నరసమ్మ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ముక్రయ్య, వెంకటేష్, జాంబవంతు, యల్లప్ప, శాంతిరాజు అన్నారు. శనివారం సజ్జలగుడ్డం గ్రామంలో గ్రామస్తులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు నెలల క్రితమే గడప గడపకు మన ప్రభుత్వం కింద ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి గ్రామానికి రూ.20లక్షలు కేటాయించి రోడ్డు పనులు మొదలు పెట్టారన్నారు. ఎన్నికల కోడ్ రాక ముందే మైనార్టీ కాలనీ, ఎస్సీ కాలనీలో రోడ్లను లెవెలింగ్ చేసి గరుసు వేసి రోడ్డు పనులు ప్రారంభించారన్నారు. అది తెలుసుకోకుండా టీడీపీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ రాజకీయం చేయడం దారుణంగా ఉందన్నారు. టీడీపీ నాయకులు గ్రామాలు అభివృద్ధి జరగడం ఓర్వలేకనే అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కాలనీ మహిళలు షెహెరా బాను, సుభానమ్మ, నరసమ్మ, నూర్ బీలు మాట్లాడుతూ రెండు నెలలుగా ఇళ్ల ముందు గరుసు వేసి పనులు చేపట్టారన్నారు. రోడ్డు వేసే సమయంలో అడ్డుపడడం బాధకరమన్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ ఏఈ నరసింహులును వివరణ కోరగా సజ్జలగుడ్డం గ్రామంలో 12.02.2024వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం నిధులు కింద రూ.20లక్షలు మంజూరు చేస్తూ రోడ్డు వేసేందుకు అనుమతులు వచ్చాయన్నారు. అప్పుడే రోడ్డు లెవెల్ చేసి గరుసు పనులు చేయించామన్నారు. సిమెంట్ రావడం ఆలస్యం కావడంతో సీసీ రోడ్డు లేటుగా వేయాల్సి వచ్చిందన్నారు. కొత్తగా మంజూరైన రోడ్డు కాదని, కొత్తగా ప్రారంభించలేదని సమాధానం ఇచ్చారు.

## కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న సీఐ, ఎస్ఐ

కౌతాళం: మండలంలో ఎవరైనా అక్రమ మద్యం విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి హెచ్చరించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, కోసిగి సీఐ ప్రసాద్ వారి ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. బాపురం చెక్‌పోస్టు సమీపంలో గోతులదొడ్డి గ్రామానికి చెందిన దుర్గయ్య, హనుమేష్, నగేష్ 20బాక్సుల్లో 90ఎంఎల్ 1,920 టెట్రా ప్యాకెట్లను రెండు మోటర్ సైకిళ్లపై తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. కాగా ఒక నిందితుడు పారిపోయినట్లు తెలిపారు. వారి వద్దనుంచి 20 బాక్సులు మద్యంతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పట్టుకున్న మద్యం విలువ సుమారు రూ.3లక్షల ఉంటుందని చెప్పారు. దాడుల్లో పాల్గొన్న ఎస్ఐతో పాటు సిబ్బంది నారాయణ, నరేంద్ర, మద్దిలేటి, రంగన్నలను ఉన్నతధికారులు అభినందించారు.

## ఎల్లెల్సీలో ఆగిపోయిన నీటి ప్రవాహం

- టీబీ డ్యాంలో నీటి నిల్వ 3.993 టీఎంసీలే



హొళగుంద సెక్షన్ ఎల్లెల్సీలో నిలిచిన ప్రవాహం

హొళగుంద: తుంగభద్ర దిగువ (ఎల్లెల్సీ) కాలువ హొళగుంద సెక్షన్‌లో నీటి ప్రవాహం నిలిచిపోయింది. వేసవి కావడం, టీబీ డ్యాంలో నీటి మట్టం అడుగంటుతుండడంతో బోర్డు అధికారులు తాగునీటి అవసరాల కోసం ఎల్లెల్సీకి ఈ నెల 11న నీటిని నిలిపివేసిన సంగతి తెలిసిందే. రెండు రోజుల పాటు పారిన నీరు శనివారం హొళగుంద వద్ద పూర్తిగా ఆగిపోయింది. నాలుగేళ్లుగా సంమృద్ధిగా వర్షాలు కురవడంతో తుంగభద్ర జలాశయానికి పూర్తిస్థాయిలో నీరు చేరి దిగువ కాలువ(ఎల్లెల్సీ) కింద రెండు కార్ల పంటలు పండించిన రైతులు ఈ ఏడాది ఒకే పంటతో సరి పుచ్చుకున్నారు. కాలువకు నీరు బంద్ కావడంతో గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక టీబీ డ్యాంలో శనివారం ఉదయం 1633 అడుగులకు గాను 1578.98 అడుగులకు నీరు చేరింది. 105.788 టీఎంసీలకు గాను ప్రస్తుతం కేవలం 3.993 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఔట్ ఫ్లో 112 క్యూసెక్కులుంది.

### ఓటరు నమోదుకు రేపే ఆఖరు

కృష్ణగిరి: ఓటరు నమోదుకు ఈ నెల 15వ తేదీ ఆఖరు అని తహసీల్దార్ అనురాధ తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ఈ రెండు రోజులు ఆయా గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

## పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



వివాహం చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సచివాలయం–3లో విధులు నిర్వహిస్తున్న వెల్దుర్తి పట్టణానికి చెందిన మాదిగ చంద్రనారాయణ (జేఎల్‌ఎమ్), డోన్‌లో నివాసముంటున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ స్రవంతి శుక్రవారం ప్రేమ వివాహం చేసుకున్నారు. శనివారం స్రవంతి తమ్ముడు, తల్లి, మరికొందరు వెల్దుర్తికి వచ్చి చంద్రనారాయణ ఇంటి వద్ద గొడవ చేశారు. దీంతో తమకు రక్షణ కల్పించాలని ఈ జంట కర్నూలు పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించింది.

### బాలికల కళాశాలలో 58 శాతం ఉత్తీర్ణత

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ బాలికల కళాశాలలో 58 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వి. సంజన్న శనివారం తెలిపారు. ప్రథమ సంవత్సరంలో గతేడాది 42 శాతం ఉత్తీర్ణత ఉంటే ఈ సంవత్సరం 46 శాతం సాధించామన్నారు. ద్వితీయ సంవత్సరంలో గతేడాది 55 శాతం ఉండగా.. ఈ ఏడాది 58 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్ బైపీసీలో పి.తస్లీమా 934/1000 మార్కులను సాధించగా, బి.మల్లేశ్వరి 910/1000, ఎం. ఇందు ఎంపీసీలో 909/1000 మార్కులను సాధించారని చెప్పారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఆర్ సుల్తానా 458/500 , డి.రంగమ్మ 448/500 , ఎం అఖిల 447/500 మార్కులను సాధించినట్లు తెలిపారు.

### గడువు పొడిగింపు

మద్దికెర: కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్మీడియెట్ ప్రవేశానికి ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రత్యేక అధికారి జ్యోతి శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### రేపటి నుంచి కుంభాభిషేక వేడుకలు

తుగ్గలి: మండల పరిధిలోని ఆర్.కొత్తూరులో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ కుంభాభిషేక ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నెల 15న గణపతి పూజ, అభిషేకాలు, దీక్షాహోమం, 16న నవగ్రహ దేవతలు, నాభిశిల, నాగదేవత విగ్రహ ప్రతిష్ట, 17న ఉదయం బాలాంజనేయ స్వామి, పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహ, శిఖర కలశ ప్రతిష్ట కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

### రత్నపల్లెలో ఇరువర్గాల ఘర్షణ

- 10 మందికిపైగా గాయాలు.. 31 మందిపై కేసు

వెల్దుర్తి(కృష్ణగిరి): పాత కక్షలతో రత్నపల్లె గ్రామంలో ఇరువర్గాల మధ్య శనివారం ఉదయం ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాలు దాడులు చేసుకోవడంతో 10 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు. పలువురికి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో నడిపి సోమన్న కోమాలో ఉండగా, సుధాకర్, రాములమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కృష్ణ, రమేశ్, విజయరాజు, కర్రెన్న, చిన్నయ్య, లక్ష్మీదేవి, సంతోషి, ఎల్లకృష్ణ, లక్ష్మణరావు, ఎల్లస్వామి చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 31 మందిపై కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

### మేటి క్రీడాకారులుగా రాణించాలి

కర్నూలు (టౌన్): అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని మేటి క్రీడాకారులుగా రాణించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి లేజర్ రన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జెండా ఊపి ప్రారంభించిన డీఎస్‌డీఓ మాట్లాడుతూ గత ఏడాది గోవాలో నిర్వహించిన జాతీయ క్రీడల్లో కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారుడు వెంకటేష్ పతకం సాధించారన్నారు. జాతీయ యోగా సంఘం సంయుక్త కార్యదర్శి న్యాయవాది శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 21 వరకు నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించనున్న 8 వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి అవినాష్ పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధికి ఓటేయండి



ప్రచారం నిర్వహిస్తున్న అనూషమ్మ

కౌతాళం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కాచపురం సర్పంచ్, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సతిమణి వై.జయమ్మ కోరారు. శనివారం మండల కేంద్రమైన కౌతాళంతో పాటు బంటకుంట, సుళేకేరి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే కుమార్తె ప్రియాంకరెడ్డి, ప్రదీప్‌రెడ్డి భార్య అనూషమ్మ, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, మండల నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని, బాలనాగిరెడ్డిని ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి ఎన్నుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యు లకు అడుగడుగునా మహిళలు ఘన స్వాగతం పలికి వారికి పసుపు, కుంకుమ, గాజులతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, నాయకులు దాట్ల సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, వడ్డెరాము, భీమేష్, అబ్దుల్ సమద్, మాజీ సర్పంచ్ అవతారం, ఇద్రూస్, ఉరుకుంద ట్రస్టుబోర్డు డైరెక్టర్ వెంకోబ, వులిగయ్య, బంటకుంట సర్పంచ్ గోపాల్‌రెడ్డి, సుళేకేరి సర్పంచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి.. అండగా ఉంటాం



చిన్నకడబూరులో ఓట్లు అభ్యర్థిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరి

పెద్దకడబూరు : నాల్గోసారి మంత్రాలయం ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డిని ఆశీర్వదిస్తే కుటుంబం మొత్తం ప్రజలకు అండగా ఉండడంతో పాటు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్ రెడ్డి అన్నారు. శనివారం ఉదయం మండల పరిధిలోని చిన్నకడబూరు, రంగాపురం గ్రామాల్లో జెడ్పీటీసీ రాజేశ్వరితో కలసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికీ కరపత్రాలు అందించి ఓట్లును అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే వైఎస్ జగనన్న లక్ష్యమన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతోనే సీఎం అడుగు ముందుకు వేస్తున్నారన్నారు. ఆయన పాలన కొనసాగాలంటే ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న వై.బాలనాగిరెడ్డికి, ఎంపీగా పోటి చేస్తున్న బీవై రామయ్యకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రరెడ్డి, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు విజయేంద్రరెడ్డి, సర్పంచ్‌లు అనసూయమ్మ, లక్ష్మమ్మ, రామాంజినేయులు, మాజీ ఎంపీపీ రఘురాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలి



బహుమతి ప్రదానం చేస్తున్న ఎంఈఓ శోభరాణి

కౌతాళం: ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని ఎంఈఓ–2 శోభరాణి అన్నారు. ప్రతిభ హైస్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు ఒక లక్ష్యంతో చదివినప్పుడే అనుకున్నది సాధించగలరని, సమాజంలో ఉన్నత స్థానం పొందగలరన్నారు. గత నెల డివిజన్ స్థాయిలో ఆదోని లక్ష్మమ్మ అవ్వ అధ్యాత్మిక కేంద్రం వారు నిర్వహించిన క్విజ్ పోటిల్లో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థినికి, అబాకాస్ ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపిన 3,4,5 తరగతుల వారికి, టార్గెట్ ఐఐటీ సంస్థ వారు నిర్వహించిన పరీక్షల్లో, వివిధ పోటీ పరిక్షల్లో కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దూద్‌బాషా, హెచ్‌ఎం జ్ఞానేశ్వరి, పాఠశాల సెక్రెటరీ మైనుద్దీన్, పర్యవేక్షకులు జయలక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రమణీయం.. వీరభద్రుని రథోత్సవం



ఎద్దులదొడ్డిలో స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు



కైరుప్పలలో అశేష జనవాహిని మధ్య కదులుతున్న రథం

తుగ్గలి: మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో వీరభద్రేశ్వస్వామి రథోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం పూలతో అలంకరించిన రథంలో స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య భక్తులు రథాన్ని లాగారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్, మాజీ సర్పంచ్ వీరేష్, గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వీరభద్రేశ్వరస్వామి

**అంగరంగ వైభవంగా రథోత్సవం**

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో వీరభద్రస్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల జయజయ ధ్వానాలు, మేళతాళాల నడుమ రథాన్ని బసవన్న దేవాలయం వరకు లాగారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అంతకు ముందు రథానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, బుసినె విరూపాక్షి, సురేంద్రరెడ్డి పూజలు చేశారు.